ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 1 ఏప్రిల్ 2025
ఉష్ణోగ్రత : గరిష్ఠం 34.0 కనిష్ఠం 22.0


మొయినాబాద్‌లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్


షాద్‌నగర్ : పండుగ విశిష్టతను వివరిస్తున్న మత పెద్ద


మంచాల : ఈద్గా వద్ద షీర్‌కుర్మా పంపిణీ చేస్తున్న ముస్లింలు


షాబాద్ : పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



షాద్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు





కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు

సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు

పకడ్బందీగా పోలీసుల బందోబస్తు

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నియమ నిష్టలతో నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలు ముగిశాయి. పండుగ నేపథ్యంలో ముస్లింలు ఈద్గాలు, మసీదులకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 31

హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి

» మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్

కడ్తాల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఏప్రిల్ 2న పర్యటించనున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ తెలిపారు. పర్యటన విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బోయిన్‌గుట్ట తండాలో సోమవారం జైపాల్ యాదవ్ పర్యటించారు. తండాలో మహనీయుల విగ్రహావిష్కరణ అనంతరం నిర్వహించే సభాస్థలిని మాజీ జెడ్పీటీసీలు దశరథ్ నాయక్, విజితారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికలకు ముందు నిర్వహించే హరీశ్‌రావు సభ విజయవంతం చేయడం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ఆనంద్, కంబాల పరమేశ్, నర్సింహ్మా గౌడ్, యాదయ్య, రవీందర్ రెడ్డి, హరిచంద్ నాయక్, జంగయ్య, వీరయ్య, లచ్చిరామ్ పాల్గొన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

సూచిక బోర్డులు లేక వాహనదారుల ఇబ్బందులు

తరచూ ప్రమాదాలు

8

డబుల్ లేట్!

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై అయోమయం

ఏళ్లతరబడి లబ్ధిదారుల ఎదురుచూపు.. నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచని వైనం

శిథిలావస్థకు చేరుకుంటున్న గృహాలు.. ఇందిరమ్మ ఇళ్లపైనే ప్రభుత్వం ఫోకస్

షాద్‌నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయడం లేదు. దీంతో ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మరికొన్ని రోజులైతే అవి కూలిపోయే ప్రమాదముంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లపైనే దృష్టిసారిస్తుండటంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేస్తారా లేదా అని లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లను వృథాగా వదిలేయకుండా పేదలకు కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


సోలిపూర్‌లో డంప్ యార్డు పక్కన నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

షాద్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల సందడి నెలకొంది. నిరుపేదలకు ఇంటి నిర్మాణం చేపట్టి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల


షాద్‌నగర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

విషయం మాత్రం ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి కొన్ని సంవత్సరాలు అవుతోంది. ఇళ్లను పంపిణీ చేయకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇళ్ల పంపిణీ గురించి పట్టించుకోవడం లేదు. ఇంతకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేస్తారా? లేక ఇందిరమ్మ ఇండ్లతోనే సరిపెడతారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ ఇళ్లు కూలకముందే

మిగతా 8వ పేజీలో...

త్వరలోనే పంపిణీ చేస్తాం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను అసంపూర్తిగా నిర్మించింది. ఇళ్లకు కరెంటు, తాగు నీటి వసతి, తలుపులు, కిటికీలు లేవు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా రూ. 2.50 కోట్లు మంజూరు చేసింది. ఇంకా రూ.3.30 కోట్లు అవసరమవుతాయని ఇంజనీర్లు తెలిపారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చించాను. రూ.3.30 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. పది రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేసిన అనంతరం అర్హులందరికీ ఇండ్లను మంజూరు చేస్తాం.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

రాజీవ్ యువ వికాసానికి 92,492 దరఖాస్తులు

» కలెక్టర్ నారాయణరెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఈబీసీ యువత ఏప్రిల్ 14లోగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు మండల ప్రజాపాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం కింద ఇప్పటివరకు 92,492 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినట్లు వివరించారు. దరఖాస్తుల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లతో రాజీవ్ యువవికాసం పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈపథకం కింద అర్హత పొందిన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


బుచ్చయ్య(ఫైల్)

మంచాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మంచాల పోలీస్ స్టేషన్ పరిధి ఆరుట్లలో తాటిచెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడు మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పాశం బుచ్చయ్య(72) కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకు పట్టు తప్పడంతో చెట్టుపై నుంచి జారిపడ్డాడు. కుటుంబసభ్యులు వచ్చి చూసేసరికి బుచ్చయ్య అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాలయ్య తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

తాగునీటి సమస్య రానీయొద్దు

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపాలిటీ అధికారులకు సూచించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తూర్ మున్సిపాలిటీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. వింటేజ్, శివాలయం, కస్తూర్బాగాంధీ పాఠశాల రోడ్డు కాలనీలలో తాగునీటి నూతన పైప్‌లైన్ కోసం అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కొత్తగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మేనేజర్ రాంచందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్, మండల శాఖల అధ్యక్షులు జె. సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి వ్యాపారానికి అనుమతి తప్పనిసరి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



జిల్లా భూగర్భజల శాఖ అధికారి
మాధవరావు

రంగారెడ్డి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : "నీటి వ్యాపారానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఇష్టానుసారం బోర్లు వేస్తే సహించేది లేదు. ఇప్పటికే జిల్లాలో 25 బోర్లు సీజ్ చేశాం" అని జిల్లా భూగర్భజలశాఖ అధికారి మాధవరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మరికొన్ని విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: నీటి వ్యాపారానికి అనుమతి తీసుకోవాలా?

జవాబు: నీటి వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. పర్మిషన్ తీసుకోని వ్యాపారులకు నోటీసులు జారీ చేశాం. నీటి వ్యాపారానికి తమ వ్యవసాయ బోరును వినియోగించరాదు. నాలా కన్వర్షన్ చేయించిన భూమిలో బోరు వేయాలి. అనుమతి కోసం స్థానిక తహసీల్దారు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అక్కడ నుంచి మా శాఖకు వస్తుంది. పరిశీలించి అనుమతి ఇవ్వడం జరుగుతుంది. వ్యాపారం చేసే నీటికి వాల్టా చట్టం ప్రకారం నివాస ప్రాంతాల్లో బోరు ఉండరాదు. ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయించే వ్యాపారులు ప్రతీ వెయ్యిలీటర్లకు రూ.10 ప్రభుత్వానికి చెల్లించాలి.

ప్రశ్న: ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలా?

జవాబు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దరఖాస్తు ఫీజు రూ. 10 వేలు ఉంటుంది. రెన్యూవల్ కోసం రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలు, వాణిజ్యం, బల్క్ నీటి సరఫరా అండ్ ప్యాకింగ్ చేయబడే తాగునీటి కోసం (25కేఎల్‌డీ) కిలో లీటర్‌కు రూ.14,500 దరఖాస్తు ఫీజు చెల్లించాలి. అలాగే 25-50 కేఎల్‌డీకి రూ.18వేలు, 50-100 కేఎల్‌డీకి రూ.32వేలు, 100 కేఎల్‌డీకి రూ.42 వేలు దరఖాస్తు ఫీజు చెల్లించాలి. రెన్యువల్ కోసం రూ.10 వేల ఫీజు ఉంటుంది. మైనింగ్ ప్రాజెక్టులకు అప్లికేషన్ ఫీజు లక్ష రూపాయలు ఉంటుంది. రెవెన్యూల్ ఫీజు కూడ లక్ష ఉంటుంది. జీడబ్ల్యూఆర్ఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: జిల్లాలో నీటి వినియోగం ఎలాఉంది?

జవాబు: అర్బన్ ప్రాంతాల్లో విపరీతంగా నీటిని వినియోగిస్తున్నారు. జిల్లాలో శేరిలింగంపల్లిలో అత్యధిక నీటి వినియోగ మండలంగా ఉంది. 400 ఫీట్లలోపు మాత్రమే బోరు వేయాలి. మినరల్స్ సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ లోతులో వేసిన బోరు నీటిని తాగినా ఉపయోగం ఉండదు.

ప్రశ్న: బోరు వేయాలంటే అనుమతి అవసరమా?

జవాబు: వాల్టా చట్టం ప్రకారం బోరు వేయాలంటే తప్పనిసరిగా అనుమతి పొందాలి. జిల్లాలో 55 మంది రిగ్గు యజమానులు బోరును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇంతకు ముందు మరో 30 వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రిగ్గులున్నాయి. పర్మిషన్ లేకుండా బోర్ వేస్తే బోరు బండిని సీజ్ చేస్తాం. గృహవినియోగదారులు బోరు వేసుకోవాలంటే వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న: వాటర్ ప్లాంట్స్ రూల్స్ పాటిస్తున్నారా?

జవాబు: నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్‌లలో ఎయిర్ కండిషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్ మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్ ఇవ్వడం, రెన్యూవల్ చేస్తాం. ప్లాంట్ నిర్వహణతో పాటు వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రజల కోసమే ప్రభుత్వ నిర్ణయాలు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడి

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పేదల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని కసిరెడ్డి తెలిపారు. విపక్షాలు కుట్ర రాజకీయలు వీడి అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, కృష్ణనాయక్, సురేందర్ రెడ్డి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ భూములను అమ్మొద్దు'

ఇబ్రహీంపట్నం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ యూనివర్సిటీలో 400 ఎకరాల అటవీ భూములను వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పనులకు అడ్డుపడిన విద్యార్థులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

వడదెబ్బ.. జాగ్రత్తలే రక్ష

● ఎండలో తిరగకుండా చూసుకోవాలి
: డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు



షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో మధ్యాహ్న సమయంలో బయట తిరిగే వారు వడ దెబ్బ బారిన పడుతున్నారు. వడ దెబ్బ ఒక్కోసారి ప్రాణాలపైకి తెస్తుంది. వడ దెబ్బ నివారణ చర్యలు, తగిలాక అందించాల్సిన చికిత్స గురించి చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేంద్రబాబు చేసిన సూచనలివీ..

వడదెబ్బ: మండుటెండలో ఎక్కువ సేపు వృత్తి పరమైన కూలీ పనులు చేసే వారు, అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారిలో చాలా మంది వడదెబ్బ బారిన పడుతుంటారు. వారి శరీర ఉష్ణోగ్రత 105 ఫారన్ హీట్‌కు మించడంతో పాటు నీరసించడం, సొమ్మసిల్లి పడిపోవడాన్నే వడదెబ్బ అంటారు.

సన్‌స్ట్రోక్ లక్షణాలు : శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల ఫారన్ హీట్, అంత కంటే ఎక్కువకు చేరడం. అయోమయమైన స్థితి, నీరసించిపోవడం, చర్మం పొడిబారడం, నాడి ఎక్కువగా కొట్టుకోవడం, అపస్మారక స్థితి, మాటలు తడబడడం, శ్వాసక్రియ ఎక్కువవడం ఉంటాయి.

కారణాలు: ఎక్కువ సేపు ఎండలో పనులు చేయడం, తిరగడం. నీరు తక్కువగా తాగడం. ద్రవ పదార్థ ఆహారాన్ని సరిగా తీసుకోకపోవడం. మత్తుపానీయాలు ఎక్కువగా సేవించడం. చిన్న పిల్లలు ఎక్కువ సేపు ఎండలో ఆడుకోవడం వంటి వాటితో వడదెబ్బ సోకుతుంది.

నివారణ: సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, లేదా గొడుగు, తలపాగ ధరించాలి. చలువ కళ్లద్దాలు ధరించాలి. వదులుగా ఉండే తెల్లని దుస్తులు వేసుకోవాలి. నీరు, ద్రవపదార్థాలు(కొబ్బరి నీరు, మజ్జిగ, అంబలి) ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని తీసుకోవాలి. ఆహారాన్ని తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తీసుకోవాలి. నీడలో గడపాలి. ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గేలా కిటికీలు, తలుపులకు తెరలను లేదా చాపలను కట్టుకోవాలి. శరీరానికి చెమట ఎక్కువగా పడుతుంది కాబట్టి సాయంత్రం వేళ స్నానం తప్పకుండా చేయాలి.

చేయకూడనివి..

నల్లని వస్త్రాలు ధరించకూడదు. మత్తుపానీయాలు సేవించకూడదు. టీ, కాఫీలను తక్కువ చేయాలి. ఎండలో ఎక్కువ తిరగొద్దు.

చికిత్స : వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి ఇతర సపర్యలు చేయాలి.

● శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి తడిగుడ్డతో పలుమార్లు తుడవాలి.
● నీరు ద్రవపదార్థాలు, పండ్ల రసాలు తాగాలి.
● ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంత అద్దితే చాలా మంచిది. అపస్మారక స్థితికి వెళ్తే ఐటీ సెలైన్ ఎక్కించాలి.
● రోగి నాడి, బీపీ, శరీర ఉష్ణోగ్రతలను తరచూ జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రిలో చేర్పించాలి.

యాలాలలో అంబలి పంపిణీ


గ్రామస్తులకు అంబలి పంపిణీ చేస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

యాలాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): యాలాల మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్‌రెడ్డి సోమవారం రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబ, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, ఉపాధ్యక్షుడు మోహి జ్, కార్యదర్శి హైమద్ పాల్గొన్నారు.

విద్యార్థినుల సేవా కార్యక్రమాలు అభినందనీయం


సుభాన్‌పూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

మహేశ్వరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటనమస్) కళాశాల-హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని సుభాన్‌పూర్‌లో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు సోమవారం ఐదో రోజుకు చేరాయి. గ్రామంలో విద్యార్థినులు పచ్చదనం పరిశుభ్రత, ఓటు ప్రాధాన్యం, ఉద్యోగాల సాధన, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం తదితరాంశాలపై ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే విద్య, ఉపాధి లేని లేని యువత వివరాలు సర్వే చేసి తెలుసుకున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింహులు మాట్లాడుతూ.. విద్యార్థునులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం మంచి పరిణామం అన్నారు. మాజీ సర్పంచ్ పద్మపాండు మాట్లాడుతూ.. హైదరాబాద్ విద్యార్థినులు గ్రామంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యార్థినులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రోగ్రాం అధికారులు జి.నర్సింహులు, ఎం.మధుకర్‌రావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న అంజనేయులు

కులకచర్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని బిందెంగడ్డ తండాలో రూ.5లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీలోని ప్రతాప్‌సింగారం గుబ్బరిగుట్ట మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఆవరణలో జరిగిన గణపతి హోమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గోపూజ, అభిషేకం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్, పీసీబీ సభ్యుడు మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దుద్యాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లిలోని తంగెళ్లగడ్డ వీధిలో సోమవారం మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రహోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.





కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆర్సీలు, డ్రైవింగ్ పత్రాలు వెంట తప్పనిసరి

యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనాదారుడు ఆర్సీలు, డ్రైవింగ్ పత్రాలు, బీమా పత్రాలు వెంట పెట్టుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు సూచించారు. సోమవారం సాయంత్రం కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలు ఇతర వాహనాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని చెప్పారు.



నెహ్రూ యువ కేంద్రానికి ఎంపికైన అనురాగ్ విద్యార్థులు

ఎన్‌వైకేకు అనురాగ్ విద్యార్థుల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌కు అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. వెంకటాపూర్‌లోని యూనివర్సిటీలో జిల్లాస్థాయి నెహ్రూ యువకేంద్ర సంఘటన్, వికసిత్ భారత్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 13 జిల్లాల నుంచి 130 మంది విద్యార్థులు, వలంటీర్లు హాజరయ్యారు. ఎన్‌వైకే సంఘటన్ డైరెక్టర్ ఖుష్బూ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ సేవలో పాల్గొని దేశాభివృద్ధి పాటుపడాలని సూచించారు. మంచి పౌరులుగా ఎదగాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ సీఈవో నీలిమ, ప్రొఫెసర్లు ముత్తారెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సి.మల్లేష్, లెక్చర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సత్కరిస్తున్న శ్రీశైలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ మండలంలో పర్యటించి పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర బీజేవైఎం లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం సోమవారం ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కరువు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం మండల బీజేపీ అధ్యక్షుడు యాదీష్, జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

బహుజన పాలనే బీఎస్పీ ధ్యేయం

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న అన్నారు. అధికారం ఆధిపత్య వర్గాల చేతుల్లో ఉన్నంత కాలం బహుజనులు పథకాల కోసం ఎదురుచూడక తప్పదన్నారు. ఏప్రిల్ 26న నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఎస్పీ నిర్వహించే మహనీయుల జాతర కరపత్రాలు, పోస్టర్లను సోమవారం నాగన్న ఆవిష్కరించారు. మహనీయుల జాతరకు ఎంపీ, బీఎస్పీ నేషనల్ కో-ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ రాబోతున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ ధనుంజయ, అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్, నాయకులు పథ్వీరాజ్, రాంచందర్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. కేసారంలో ఎస్‌డీఎఫ్ రూ.5లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై దృష్టిపెట్టాని, గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, ప్రధానకార్యదర్శి సంతోష్, నాయకులు రాంచందర్, శ్రీరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి, నాపరాయి తరలింపు

- అడ్డుకుంటున్న వారిపై దాడులు
- తాండూరు నియోజకవర్గంలో భద్రత లేదంటున్న ఉద్యోగులు
- మహిళా అధికారికి తీవ్ర బెదిరింపులు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు(ఫైల్)

తాండూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో ఇసుక, ఎర్ర మట్టి, రాయల్టీ మాఫియాలు రెచ్చిపోతున్నాయి. అక్రమాలను అడ్డుకుంటే దాడులు సైతం చేస్తున్నారు. ఇందుకు తాజా సంఘటనలే నిదర్శనం. అడ్డుకునే అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చెప్పింది వినకుంటే ఏం చేయాలో అదే చేస్తామని బెదిరిస్తున్నారు. దాడులకు ఈ మాఫియా బృందాలను సైతం ఏర్పాటు చేసుకున్నట్టు చెబుతున్నారు. తాండూరు మండలం వీరశెట్టిపల్లిలోని కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఫిరంగి జర్నప్ప 100 డయల్ చేసి కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విఠల్‌రెడ్డి మార్చి 21న అర్ధరాత్రిన తన సిబ్బందితో నది వద్దకు చేరుకొని ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక నింపిన రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చాడని ఓ మాజీ సర్పంచ్ గ్యాంగ్ గత నెల 21న జర్నప్పపై దాడి చేశాడని చెబుతున్నారు. అక్రమార్కులు అర్ధరాత్రి గ్రామంలోకొచ్చి దాడి చేయడంపై స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఉదంతం గ్రామంలోని సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో బాధితుడు జర్నప్ప మాజీ సర్పంచ్ అనుచరులపై పోలీసు ఫిర్యాదు చేశాడు. మాజీ సర్పంచ్ భీమప్పతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని జర్నప్పే తమపై దాడిచేశాని భీమప్ప సైతం ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడ్డుకుంటే అంతు చూస్తాం!



తాండూరులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కాగ్నా, కాక్రవేణి నదుల నుంచి ఇసుక తోడుతున్నారు. ఖాంజాపూర్‌లో ఎర్ర మట్టి, కాగ్నా నుంచి ఇసుక అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారు. అడ్డుకునే వారిపై దాడులకు, బెదరింపులకు పాల్పడుతున్నారు. ఈ పనులకు డబ్బు వెచ్చించి టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దాడులతో పాటు ఓవర్ స్పీడ్‌తో టిప్పర్లు, ట్రాక్టర్లు తిప్పుతూ అడ్డొస్తే గుద్దిచంపుతాం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. పోలీసులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రజలంటున్నారు. రాయల్టీ కట్టకుండా తరలుతున్న లారీలను అడ్డుకున్న రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నిర్మలను ఇటీవల మాఫియా బెదిరించింది. మైన్స్ సహాయ సంచాలకు(అసిస్టెండ్ డైరెక్టర్) సత్యనారాయణనూ హెచ్చరించారు. గౌతాపూర్ చెక్‌పోస్ట్ ఆఫీసర్ నిర్మల రాయల్టీ బిల్లు లేని 11 నాపరాయి లారీలను పట్టుకున్నారు. లారీ డ్రైవర్ మల్కాపూర్ అనిల్ లారీని ఆపకుండా గౌతాపూర్ నుంచి కరన్‌కోట్ మీదుగా మల్కాపూర్‌నకు పారిపోయేందుకు యత్నించగా నిర్మల లారీని అదుపులోకి తీసుకున్నారు. 'మీరు లారీని ఆపితే టైర్ల కింద నలిగిపోతారు.' అని డ్రైవర్ హెచ్చరించాడని అధికారులు తెలిపారు. పైస్థాయి ఒత్తిళ్లతో కేసు నమోదుకు అధికారులు వెనకడుగు వేశారు. మైన్స్ హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందరాజు తాండూరు వచ్చి కేసు నమోదు చేసే వరకు వదల్లేదు. కాగా ఏడాదిగా అక్రమంగా నాపరాతిని కర్ణాటకకు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇలాగే వదిలేస్తే ఈ మాఫియా మరింత రెచ్చిపోతుందని, ఉన్నతాధికారులు వెంటనే వీరిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆమనగల్లు మార్కెట్‌కు రెవెన్యూ టార్గెట్ పూర్తి

- లక్ష్యానికి మించి రూ.10లక్షల ఆదాయం
- మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు లక్ష్యానికి మించి ఆదాయాన్ని ఆర్జించిందని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ తెలిపారు. మార్కెట్ డైరెక్టర్లు, అధికారుల కృషితో లక్ష్యాలను అధిగమించామన్నారు. మార్కెట్ యార్డ్‌లో సోమవారం మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2024-25కు ఆమనగల్లు ఏఎంసీకి రూ.3.14కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. కాగా రూ.3.24కోట్ల రెవెన్యూ వచ్చిందని గీత వివరించారు. పత్తి కొనుగోళ్లతో సీసీఐ నుంచి రూ.1.9కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే వడ్ల కొనుగోళ్లతో పౌరసరఫరాల శాఖ ద్వారా రూ.34లక్షలు, పంట ఉత్పత్తుల లావాదేవీలతో మిల్లర్లు, కొనుగోలుదారుల ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరిందని చైర్‌పర్సన్ చెప్పారు. పత్తి అమ్మకాలపై ఎక్కువ ఆదాయమొచ్చిందన్నారు. జీరో వ్యాపారానికి తావులేకుండా మార్కెట్ ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అగ్రికల్చర్ చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. మార్కెట్ ఆదాయం పెంపునకు రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. తమ పంట ఉత్పత్తులను యార్డ్‌లోనే విక్రయించాలని కోరారు. యార్డ్‌లో రైతులకు మెరుగైన వసతుల కల్పించేలా ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో కార్యాచరణ రూపొందించామని గీత వెల్లడించారు. సమావేశంలో ఏఎంసీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, డైరెక్టర్లు కండె పాండురంగయ్య, పి.శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్, కేశవరెడ్డి, అంజయ్య, జంగయ్య, యాదయ్య, రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, రవీందర్, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

దోమ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో సోమవారం రంజాన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. చేతులకు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నినాదాలు చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్ బిల్లులో కొత్త చట్టం కాకుండా ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నజీమ్, మహమూద్, బాగ్దాద్, ఖాజ, సాదీక్, రవూఫ్, మహ్మద్ షఫీ, గౌస్, షేర్‌ఖాన్, కలీం ఖాన్, అక్రమ్‌ఖాన్, ఫరీద్‌పాషా, మొయిజ్, ఫిరోజ్ పాషా, ఇంతియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.



దగ్ధమైన హోటల్‌ను పరిశీలిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

అధైర్యపడొద్దు .. అండగా ఉంటాం

ఆమనగల్లు, మార్చి31(ఆంధ్రజ్యోతి): బాధితులు అధైర్య పడొద్దని, వారికి అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి వద్ద ప్రమాదవశాత్తు కాలిపోయిన చైత్ర రెస్టారెంట్‌ను సోమవారం శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టంపై అడిగి తెలుసుకున్నారు. ర.5లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు శ్రీను చెప్పాడు. పరామర్శించిన వారిలో నాయకులు పత్యానాయక్, పరమేశ్, రమేశ్‌గౌడ్, రమేశ్, సయ్యద్ ఖలీల్ ఉన్నారు.

ఆలయంలో ఘనంగా పడిపూజ

నందిగామ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నందిగామలో ఆదివారం రాత్రి అయ్యప్ప ఆలయంలో గురుస్వామి గిరీషన్‌నాయర్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, ఇతర పూజలు చేశారు. ఆలయంలో పడి వందనాన్ని సిద్ధాపూర్ శేఖర్‌రెడ్డి వెలిగించారు. పూజలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నందిగామ మాజీ సర్పంచ్ క్రిష్ణ భక్తులకు అల్పాహారం నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నారయణరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గూడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పనులు

మెరుగవనున్న వైద్య సేవలు.. రూ. 17.5కోట్లతో ఆస్పత్రి నిర్మాణం

అక్టోబరు నాటికి వినియోగంలోకి కొత్త భవనం



ఆమనగల్లులో కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పతి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అక్టోబరు కల్లా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. 50ఏళ్ల కింద నిర్మించిన ఆమనగల్లు ఆస్పత్రి భవనం శిథిలమైంది. రోగులకు, వైద్య సిబ్బందికి వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు. కొత్త భవనం నిర్మించాలని మండల వాసులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. 2023 ఆగస్టు 18న నూతన భవన నిర్మాణానికి వైద్యవిధాన పరిషత్ నుంచి రూ.17.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తయినా నిధులు రాక పనులు ప్రారంభించ లేదు. నూతన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు విడుదల చేయించి 2024 జూలై 10న మరోసారి శంకుస్థాపన చేశారు. పాత భవనాన్ని కూల్చి బిల్డింగ్ పనులు ప్రారంభించారు. తలపెట్టిన మూడు ఫ్లోర్‌లకు మొదటి అంతస్తు పూర్తయ్యింది. రెండో అంతస్తు పనులు చేస్తున్నారు. ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ అబ్దుల్ అజీజ్, డీఈ రవీందర్‌ల పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. మూడు ఫ్లోర్‌లతో 45వేల ఎస్ఎఫ్టీ వైశాల్యంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. కట్టడానికి రూ.12కోట్లు, ఆస్పత్రి సామగ్రికి రూ.5.5కోట్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. గడువులోగా పనులు పూర్తి చేస్తామన్నారు.

తొలగనున్న ఇబ్బందులు



ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి నూతన భవనంతో రోగులకు ఇబ్బందులు తొలగుతాయి. మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో నిధులు విడుదలయ్యాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

- బాబు, ఆమనగల్లు

నిర్ణీత గడువులోపు పూర్తి



ఆస్పత్రి భవన నిర్మాణాన్ని గడువులోపు పూర్తి చేస్తాం. పనులు వేగంగా చేస్తున్నాం. అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాం. మూడంతస్తులకు ఇప్పటికే మొదటి అంతస్తు పూర్తైంది. మరో పది రోజుల్లో రెండో అంతస్తు నిర్మాణం జరుగుతుంది.

- రవీందర్, డీఈ, ఆమనగల్లు

అక్రమ క్రషింగ్

- అల్లాపూర్‌లో క్రషర్ మిషన్ నిర్వహణ
- నామమాత్ర పన్నుతో ఏళ్లుగా కొనసాగింపు
- అనుమతిలేకుండా కొత్త భవన పనులు
- కన్నెత్తి చూడని అధికారులు



అల్లాపూర్‌లో కొనసాగుతున్న క్రషింగ్ మిషన్

తాండూరు రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అల్లాపూర్ పంచాయతీకి ఓ క్రషర్ వ్యాపారి గండి కొడుతున్నారు. అల్లాపూర్‌లో రెండేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకుండా క్రషర్ నడపుతున్నారు. అలాగే అనుమతులు తీసుకోకుండానే కొత్తగా మరో కర్మాగార నిర్మాణానికి పనులు చేస్తున్నాడు. అయినా పంచాయతీ కార్యదర్శి ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. రోజూ రోడ్డుకు ఇరువైపులా నాపరాతి ముక్కల వ్యర్థాలను పడేయడం, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో నాపరాతిని తరలించి డస్ట్ తయారు చేసి విక్రయించడం వంటివి చేస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ఇక్కడి నుంచే నాసిరకమైన డస్ట్‌ను తీసుకెళ్లి ఉపయోగిస్తున్నారు. దీంతో పనుల్లో నాణ్యత లేకుండా పోతోంది. ఇసుక వాడాల్సిన చోట సాండ్ డస్ట్‌ను వాడుతున్నారు. కొన్ని రోజులకే పనులు బీటలు వారుతున్నాయి. క్రషర్ యజమాని నిత్యం డస్ట్ తయారు చేసి విక్రయిస్తున్నాడు. శాఖ కూడా ట్యాక్సులు కట్టడం లేదు. అసలు ఇక్కడ మైనింగ్ చేస్తున్నట్టు శాఖకు సమాచారం ఉందా? అనేది కూడా అనుమానంగా ఉంది. ఇంత పెద్ద ఎత్తున క్రషర్ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారి అల్లాపూర్ పంచాయతీకి ఏడాదికి రూ.5వేలు మాత్రమే చెల్లిస్తూ పన్నుకు గండి కొడుతున్నాడు. ఆస్తిపన్ను రూపేణా ప్రజల నుంచి ఇంటి పన్ను రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్న అధికారులు.. క్రషర్ వ్యాపారి ఏటా కేవలం రూ.5వేలు చెల్లిస్తున్నా చర్యలెందుకు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్లపాటు పంచాయతీకి ఆస్తిపన్ను కట్టలేదు. ఇదిలా ఉంటే పక్కనే వ్యవసాయ భూమిలో మరో క్రషర్ నిర్మాణానికి పిల్లర్లు వేశారు. అల్లాపూర్‌లో వ్యవసాయ భూముల్లో పెద్దఎత్తున స్టోన్ యూనిట్లు నిర్మిస్తున్నా రెవెన్యూ పంచాయతీ, మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ, గనుల శాఖకు పన్నులు చెల్లించకుండా కొనసాగిస్తున్న క్రషర్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



మరో కర్మాగార నిర్మాణానికి వేసిన పిల్లర్లు

పర్యటించి చర్యలు తీసుకుంటాం



అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి భవానీ ధారూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కరుణాకర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించాం. ఆయన కూడా ఇంకా బాధ్యతలు చేపట్ట లేదు. క్రషర్ యజమాని రెండేళ్లుగా పంచాయతీకి ట్యాక్సు కట్టలేదని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై కార్యదర్శులతో క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటాం. అక్రమమని తేలితే రెండేళ్ల ట్యాక్సు వసూలుతో పాటు భారీ ఎత్తున జరిమానా విధిస్తాం.

- విశ్వప్రసాద్, ఎంపీడీవో



భలే ఐడియా!

కోతుల బెడద నివారణకు కొండెంగల ఫొటోలు

చాలా చోట్ల పొలాల్లో పంటలను కోతులు పాడు చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు మామిడి తోటలపైనా పడి కాయలన్నీ రాలేలా చేస్తున్నాయి. తినేది తక్కువే అయినా కోతుల దుంకుడుకు మామిడి కాయలు రాలుతున్నాయి. గుంపులుగా చెట్లు ఎక్కి తోటలను నాశనం చేస్తున్నాయి. యాచారంలోని మొండిగౌరెల్లి రోడ్డులో ఉన్న మల్లారెడ్డి మామిడి తోటలోకి కోతులు ఎగబడుతున్నాయి. కాయలన్నీ కొరికి పారేస్తున్నాయి. దీంతో కోతులను తరిమేందుకు రైతు పెద్ద పెద్ద కొండెంగల ఫ్లెక్సీలను చెట్లకు కట్టారు. ఆ ఫొటోలు చూసి కోతులు పారిపోతున్నాయని రైతు చెప్పారు.

- యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో రంజాన్



చేవెళ్ల : ఆలూర్‌లో ప్రత్యేక ప్రార్థనలు



షాద్‌నగర్ అర్బన్: ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలతో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే భీష్మ కిష్టయ్య

రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజులుగా పాటించిన ఉపవాస దీక్షలు ముగిశాయి. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇమామ్‌లు శాంతి సందేశమిచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ముస్లింలకు విషెస్ తెలిపారు.



ఆమనగల్లు : ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



శంషాబాద్ : ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



శంకర్‌పల్లి : ముస్లింలతో ఎమ్మెల్యే యాదయ్య



కొందుర్గు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



ఇబ్రహీంపట్నం : ఈద్గా మైదానంలో ప్రార్థనలు



కొత్తూర్ : జేపీ దర్గా వద్ద శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావ్



కందుకూరు : నేదునూరు ఈద్గా మైదానంలో ముస్లింలు



యాచారం : ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు



ఆమనగల్లు : రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి



కేశంపేట : నిర్దవెల్లిలో ప్రార్థనల అనంతరం ముస్లింలు



చౌదరిగూడ : శ్రీరంగాపూర్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ చిన్నారెడ్డి

చలివేంద్రం ప్రారంభం

చౌదరిగూడ, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఏడాది చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్ఐ విజయ్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో శ్రీ అమ్మ చలివేంద్రాన్ని ఎస్ఐ విజయ్, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు ఎజాజ్ అలీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడలో చలివేంద్రం ప్రారంభిస్తున్న, ఎస్ఐ, నాయకులు

రోడ్డును పూర్తి చేయాలి

షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరేడ్లగూడ గ్రామానికి బీటీ రోడ్డు సగం వరకు వేశారని, గ్రామం వరకు పూర్తిచేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గ్రామస్తులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా మా గ్రామానికి రోడ్డు అసంపూర్తిగా ఉందని, దీన్ని పూర్తిచేయాలని, లేని యెడల షాబాద్ మండల కేంద్రంలో రిలే నిరహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వం మాదిగ, మాల మహానాడు జిల్లా నాయకుడు చందు, గ్రామస్తులు జంగయ్య, కృష్ణయ్య, రాములు, కృష్ణ, శంకర్, అంజయ్య, మహేందర్, అర్జున్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ

'డబుల్' లేట్!

(5వ పేజీ తరువాయి)

అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనైనా సొంతింటి కల నెరవేరుతుందని ఆశిస్తే నిరాశే మిగిలిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలో...

షాద్‌నగర్ మున్సిపాలిటీతో పాటు కొత్తూరు, నందిగామ మండలాల పరిధిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 1736 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి సుమారు 3800 మంది దరఖాస్తు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు పట్టణంలోని పెన్షన్ కార్యాలయంలో అప్పటి కౌన్సిలర్ల సమక్షంలో అర్హుల జాబితాను రూపొందించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు జాబితాను రూపొందించారంటూ కొందరు కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. ఎట్టకేలకు అక్టోబర్ 2023న అప్పటి పురపాలిక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో ఏడుగురికి ఇళ్ల పట్టాలు అందజేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్ రూపొందించిన జాబితాపై అభ్యంతరం తెలిపింది. అనర్హులకు ఇండ్లు కేటాయించారని, అసలైన అర్హులను గుర్తించి పంపిణీ చేపడతామని ప్రకటించింది. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో అన్ని వసతులు కల్పించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అప్పటి జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన షాద్‌నగర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించి మూడు నెలల్లోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంతలోనే కలెక్టర్ బదిలీ కావడంతో డ బుల్ బెడ్ రూం ఇండ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది.

లబ్ధిదారుల్లో ఆందోళన

ఇంతకు తమకు డబుల్ బెడ్ రూంలు అందజేస్తారా? లేదా? అని అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇండ్లను ప్రారంభించి ఏడాదిన్నర గడుస్తున్నా పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లను కూడా అందజేయాలని కోరుతున్నారు.

కొత్తూరు, నందిగామలోనూ..

కొత్తూరు, నందిగామలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యినప్పటికీ ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. నందిగామ మండల కేంద్రంలో 120 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించగా 100మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నలుగురికి మాత్రమే ఇండ్లను కేటాయించి.. మిగతా వాటిని పంపిణీ చేయకుండా వదిలేశారు. కొత్తూరు మండలం తిమ్మాపూర్ మున్సిపాలిటీలో 66 ఇండ్లు నిర్మించగా 22మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇళ్లను కేటాయించలేదు. షాద్‌నగర్ నియోజకవర్గంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి సుమారు రూ.220 కోట్లు ఖర్చు చేశారు. ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిని ఢీకొన్న లారీ.. గాయాలు

షాద్‌నగర్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో మంగళవారం సాయంత్రం లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైనాయి. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన రాజు(40) బైక్‌పై పరిగి రోడ్డులో వెళ్తూ కాసం క్లాత్ షోరూం సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా పరిగి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. బైక్ లారీ వెనుక చక్రాల కింద పడింది. బైక్ కింద రాజు కాళ్లు ఉన్నాయి. ఈక్రమంలో బైక్‌పై నుంచి లారీ వెళ్లింది. దాంతో అతడి అరికాళ్లు విరిగిపోయాయి. పోలీసులు క్షతగాత్రుడిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

టీవీ రంగయ్యకు ఉగాది పురస్కారం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి చెందిన కేంద్ర సాంస్కృతికశాఖ గవర్నింగ్ బాడి సభ్యుడు, నటుడు, సంస్కార భారతీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్యను ఆంధ్ర నాటక కళాపరిషత్ ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఆంధ్రనాటక కళాపరిషత్, కమ్మసంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ కమ్మసంఘం భవనంలో కళాకారులను సత్కరించారు. కిమ్స్ వైద్యశాలల అధిపతి బొల్లినేని కృష్ణయ్య, ఆంధ్ర నాటక కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, కమ్మసంఘం అధ్యక్షుడు ఎం రామకృష్ణ రంగయ్యను సత్కరించారు. నాటక రంగానికి చేస్తున్న సేవను గుర్తించి తనను ఉగాది పురస్కారంతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని, తాను మరింత ఉత్సాహంతో పనిచేస్తానని రంగయ్య తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న టీవీ రంగయ్య

పొంచి ఉన్న ప్రమాదం

- సూచిక బోర్డులు లేక వాహనదారుల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు.. పట్టని అధికారులు



మీర్కాన్‌పేట నుంచి ఆకులమైలారం వెళ్లే రోడ్డులో మూల మలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు

కందుకూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లు మలుపులు తిరిగి ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు హెచ్చరికలు కరువయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. కొన్ని గ్రామాలను కలిపే రోడ్లపై మలుపులు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి. మండలం పరిధిలోని రాచలూరు-తిమ్మాపురం గ్రామాన్ని కలిపే పంచాయతీ రోడ్డు రెండు ప్రాంతాల్లో ప్రమాదకరంగా మలుపులు కలిగి ఉంది. సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తిమ్మాపురం-మాదాపురం, గుమ్మడవెల్లి-మాదాపురం, లేమూరు-తిమ్మాపురం గ్రామాలకు వెళ్లే రోడ్డుపై కూడా సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా మీర్కాన్‌పేట-ఆకులమైలారం వెళ్లే రోడ్డుపై రెండు ప్రాంతాల్లో చెట్లు ఏపుగా పెరగడంతో పాటు మలుపులు ఉన్నాయి. ఒక చోట మలుపు పక్కన పురాతనమైన బావి ప్రమాదకరంగా ఉంది. అక్కడ కూడా సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



గ్రామాలను కలిపే ప్రధాన రోడ్లపై మలుపుల వద్ద అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. కొన్ని గ్రామాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినా రంగు వెలిసిపోయాయి. మరికొన్ని చోట్ల బోర్డులు విరిగిపోయాయి. వాటికి మరమ్మతులు చేయాలి.

- సాధ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, కొత్తగూడ

మలుపుల వద్ద చెట్లను పెరగనివ్వొద్దు



గ్రామాలను కలిపే రోడ్లపై గల మలుపుల వద్ద చెట్లను ఏపుగా పెరగకుండా చూడాలి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- బి.నరేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్, కటికపల్లి



చెక్కు అందజేస్తున్న అంజన్‌రెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు దారెడ్డి అంజన్‌రెడ్డి అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన కృష్ణమ్మ, నాగలక్ష్మి, లక్ష్మమ్మలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.64వేలు మంజూరయ్యాయి. సోమవారం స్థానిక నాయకులతో కలిసి అంజన్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాలు అందిస్తుందని తెలిపారు. భగవాన్‌రెడ్డి, ప్రకాశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం దామర్లపల్లికి చెందిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని, వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, లింగం, ఖాజామియాపటేల్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, నాయకులు చేవెళ్ల స్వామి, సుభాష్‌రెడ్డి, రాఘవేందర్, రవీందర్, మాధవరెడ్డి, మల్లారెడ్డి, బురాన్, దస్తగిరి, సత్యం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో మధుసూదన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన పోచమ్మ ఆదివారం మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, మంకి శ్రీను, క్యామ రాజేశ్, బోసు రవి, భానుకిరణ్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గుండెమోని మృతి చెందాడు. సోమవారం మృతుని కుటుంబ సభ్యులను మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్, ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ రూ.3వేలు సమకూర్చగా బాధిత కుటుంబానికి స్థానిక నాయకులు అందజేశారు. అదేవిధంగా తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యాన్ని అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, కోటేశ్వర్, రవికుమార్, దశరథ తదితరులు ఉన్నారు.

నేడు సన్నబియ్యం పంపిణీ

కేశంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ దుకాణాలలో నేడు(మంగళవారం) ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ప్రారంభిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కేశంపేట రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తారన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడికి గ్రామస్థులతో పాటు సమీప మరో 10 గ్రామ పంచాయతీల ప్రజలు ఏకమయ్యారు. నెలల తరబడి రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని జేఏసీ నాయకులు గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కాగా, గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 146వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే 11 కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లిని చేర్చాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దీక్షలో జేఏసీ నాయకులు